నేడు సోషల్ ఆడిట్

మొగుళ్లపల్లి, డిసెంబర్10 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణవేణి తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వరకు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ పనులపై నిర్వహించనున్న ఓపెన్ ఫోరానికి జిల్లా గ్రామీణ అధికారి పురుషోత్తం హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సాంబశివారెడ్డి

మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేత

మంగపేట, డిసెంబర్10 : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి తాగునీటి సరఫరా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ సాంబశివారెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాడి దామోదర్‌రెడ్డి, పసుపులేటి కార్తీక్ తదితరులున్నారు.

గట్టమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

గట్టమ్మకు భక్తుల పూజలు

ములుగురూరల్, డిసెంబర్10 : ములుగు మండలంలోని గట్టమ్మకు ఆదివారం భక్తులు పూజలు చేశారు. మేడారానికి వెళ్లే భక్తులతో పాటు రామప్ప, లక్నవరం పర్యాటక ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులు గట్టమ్మ దేవాలయం వద్ద ఆగి మొక్కులు చెల్లించారు. భక్తుల రాకతో గట్టమ్మ వద్ద సందడి నెలకొంది.

సత్యనారాయణ వ్రతం చేస్తున్న కోటగుళ్ల పరిరక్షణ కమిటీ సభ్యులు

కోటగుళ్లలో కార్తీక వనభోజనాలు

గణపురం, డిసెంబర్ 10 : కోటగుళ్లలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఉసిరి, మారేడు వృక్షాల వద్ద సత్యనారాయణ వ్రతం, కార్తీక వనభోజనాలను కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడు నిర్వహించే పూజలో భాగంగా సత్యనారాయణ వ్రతం, వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు వేణుచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు నరేశ్‌చార్యులను సన్మానించారు.

రెండు బైకులు ఢీ

ఇద్దరికి గాయాలు

కన్నాయిగూడెం, డిసెంబర్ 10 : మండలంలోని కంతనపల్లి చెరువు సమీపంలో మలుపు వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ముప్పనపల్లి గ్రామానికి చెందిన పూజారి చిన్ని, అచ్చె శివ ఒకరు ఏటూరునాగారం వెళ్తుండగా, మరొకరు తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో శివ స్వల్ప గాయాలతో బయటపడగా, చిన్నికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నిని 108లో మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించి ప్రథమ సికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

మంగపేట : పూజలు చేస్తున్న ఉద్యమకారుల సంఘం నాయకులు

గోవిందరావుపేట : కేసీఆర్ కోలుకోవాలని పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు

మంగపేట, డిసెంబర్ 10 : మండల కేంద్రంలోని ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో కేసీఆర్ త్వరగా కోలుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం నాయకుడు పప్పు వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఏడుకొండలు, మండల అధ్యక్షుడు గాదె శ్రీనివాసచారి, నాయకులు చీకుర్తి సుధాకర్, యాదండ్ల రాజయ్య, గుడిసేవ నాగేశ్వర్‌రావు, గూడా వాసుదేవామూర్తి, కాటూరి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పూజలు నిర్వహించారు. మండలంలోని చల్వాయిలో సమ్మక్క-సారలమ్మకు సర్పంచ్, పూజారి ఈసం సమ్మయ్య పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహానాయక్, భూరెడ్డి మధు, కృష్ణారెడ్డి, ఓదెలు, సంజీవ, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

ములుగురూరల్‌లో..

ములుగురూరల్ : మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని తీన్మార్ మల్లన్న జిల్లా ఇన్‌చార్జి అచ్చునూరి కిషన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ పూర్తి ఆరోగ్యంతో ప్రజల పక్షాన ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరుకుంటున్నట్లు కిషన్ వివరించారు.

కేదారేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కాటారం, డిసెంబర్ 10 : మండలంలోని ధన్వాడ గ్రామంలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో కేదారేశ్వరస్వామికి భక్తులు మద్ది సూర్య నారాయణ-శ్రీదేవి లక్ష బిల్వార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయ పూజారి కృష్ణమోహన్ శర్మ తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అలంకరణలో ఉత్సవమూర్తి

జాతీయ స్థాయి అవార్డుకు పొన్నం భిక్షపతి గౌడ్ ఎంపిక

టేకుమట్ల, డిసెంబర్10 : మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన పొన్నం భిక్షపతి గౌడ్ సర్వాయి పాపన్న జాతీయ ఆవార్డుకు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ చైర్మన్ నల్ల రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గౌతమ్, విజయలలిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం భిక్షపతి గౌడ్‌కు హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో ధ్రువపత్రాన్ని అందజేసినట్లు వారు తెలిపారు. ఈ అవార్డును ఫిబ్రవరి 11న తిరుపతిలో జరిగే సౌత్ ఇండియన్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో భిక్షపతి గౌడ్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. భిక్షపతి గౌడ్ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. భిక్షపతిని గ్రామస్తులు, గీత కార్మికులు అభినందించారు.

ధ్రువపత్రం అందుకుంటున్న భిక్షపతి గౌడ్

అవార్డు అందుకుంటున్న రామాచారి

రామాచారికి అవార్డు

కృష్ణకాలనీ, డిసెంబర్ 10 : తెలుగు, వెలుగు జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలువురికి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఆదివారం ఘనంగా సన్మానించి, అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కసుబోజుల రామాచారి హనుమకొండ జిల్లా కేంద్రంలో వాస్తు, పంచాంగంలో అందిస్తున్న సేవలకు ఆదివారం అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. రామాచారిని పలువురు అభినందించారు.

టాటా ఏస్‌పై ఎడ్లబండి

టేకుమట్ల, డిసెంబర్10 : మండలంలోని బూర్నపల్లి మీదుగా ఆదివారం ఓ రైతు పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేట వైపు ఎడ్లబండిని ఓ ట్రాలీపై తీసుకెళ్లడం కనిపించింది. పలువురు ఆసక్తిగా తిలకించారు.

ట్రాలీలో ఎడ్ల బండిని తీసుకెళ్తున్న రైతు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రేగొండ, డిసెంబర్ 10 : గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యానికి మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. అధికారులు వెంటనే స్పందించాలని రైతులు లింగారెడ్డి, సంజీవరెడ్డి కోరారు.

మంత్రి శ్రీధర్ బాబుతో మండల వాసులు

మంత్రిని కలిసిన మండల వాసులు

కాళేశ్వరం,డిసెంబర్10 : రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కాంగ్రెస్ మహదేవపూర్ మండల ప్రధాన కార్యదర్శి మడుగుల పవన్ శర్మ తదితరులు కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి శుభంకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు వీ శేఖర్‌రెడ్డి, నగేశ్ యాదవ్, ఉడుత తిరుపతి, హైదరాబాద్ బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రావణ్, ప్రకాశ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

అయ్యప్ప ఆలయంలో నిత్యన్నదానం

కాటారం, డిసెంబర్ 10 : మండల కేంద్రంలోని అయ్యప్ప హరిహర క్షేత్రంలో నిత్యన్నదానం కొనసాగుతుంది. ఈమేరకు మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన తాటి మహేశ్ ఆదివారం ఆలయంలోని అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాతను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

కోటగుళ్లలో ఎస్సై దంపతుల పూజలు

గణపురం, డిసెంబర్ 10 : కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని కోటగుళ్లలో ఆదివారం ములుగు ఎస్సై బండి రామకృష్ణా గౌడ్, మమత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నరేశ్‌చార్యులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గోశాలలోని గోవులకు పండ్లు అందజేశారు.